క్లుప్తంగా

40 మంది రక్తదానం



రక్తదాతలను సత్కరించిన ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వైద్యులు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవ కార్యక్రమం మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా 40 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆస్పత్రి సీఎంవో డాక్టర్ నాగేంద్రప్రసాద్ బ్లడ్ బ్యాంక్‌లో ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వైఎస్సార్ సీపీ ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడు తోరం గౌతమ్‌రాజాతో పాటు మరో 20 మంది రక్తదాతలను సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో బ్లడ్ బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ పూల అన్నపూర్ణ, బ్లడ్ బ్యాంక్ ప్రతినిధులు దొడ్డా కాశీ, చొల్లంగి రాజశేఖర్, యల్లమిల్లి రమణమూర్తి, బళ్ల సురేష్, చిట్టిమేను కృష్ణ, దండే వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం



జేసీ నిషాంతికి చెక్కు అందిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

అమలాపురం రూరల్: వరద బాధితులకు వన్నె చింతలపూడి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు రూ.15 వేల సహాయం చేశారు. మంగళవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నిషాంతికి విద్యార్థులు చెక్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నాగ సత్యనారాయణ, ఉపాధ్యాయులు బి.సత్యనారాయణ, టీఎస్‌వీ సుబ్రహ్మణ్యం, విద్యా కమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాలబాబు, కమిటీ సభ్యులు పరమ భీమ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ట్–క్రాఫ్ట్స్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పోటీల్లో ప్రథమ బహుమతిని అందుకుంటున్న విద్యార్థిని చాందిని

తాళ్లరేవు: ఇటీవల కాకినాడలో క్రియేటివ్ హార్ట్స్ సంస్థ నిర్వహించిన రాష్ట్రస్థాయి ఆర్ట్స్–క్రాఫ్ట్స్ పోటీల్లో నీలపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌కు విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు స్కూల్ హెచ్‌ఎం రాధాకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పదో తరగతి విద్యార్థిని చిట్టూరి చాందిని ప్రథమ బహుమతి సాధించగా, 9వ తరగతి విద్యార్థిని రాయుడు స్వాతి ద్వితీయ, జనపల్లి రమ్యశ్రీ తృతీయ బహుమతిని సాధించారన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన క్రాఫ్ట్ టీచర్ సీహెచ్ మంగతాయారును అభినందించారు.

పేదలకు బియ్యం పంపిణీ



పేదలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ ఏడుకొండలు తదితరులు

ఉప్పలగుప్తం: మండలంలోని గోపవరం పంచాయతీ పరిధి బెస్తాయిపేటలో మంగళవారం అమలాపురం శాంతినగర్ సర్ జాన్సీరోస్ డాటర్స్ అఫ్ చారిటీ ఆధ్వర్యంలో 50 కుటుంబాలకు బియ్యం, దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామంలోని ఆర్‌సీఎం చర్చ్ పాస్టర్ బుంగా పాలు ఆధ్వర్యంలో పేదలకు సిస్టర్ బల్మీనా, సిస్టర్ జన్మలిత, ఎంపీటీసీ సభ్యుడు కొంకి ఏడుకొండలు చేతులు మీదుగా అందజేశారు.

మోటారు సైకిల్ చోరీ

ముమ్మిడివరం: ముమ్మిడివరం సాయిబాబా గుడి వద్ద మోటారు సైకిల్ చోరీకి గురైంది. ఐ.పోలవరం గ్రామానికి చెందిన పాల వ్యాపారి గంగుల శ్రీను మంగళవారం తన మోటారు సైకిల్‌ను గుడి ముందు పెట్టి బాబా దర్శనానికి లోపలకు వెళ్లాడు. బయటకు వచ్చి చూడగా అతడి మోటారు సైకిల్ చోరీకి గురైంది.

హోరాహోరీగా టేబుల్ టెన్నిస్ పోటీలు

యానాం: స్కూల్‌గేమ్స్ చాంపియన్‌షిప్‌లో భాగంగా మంగళవారం స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో అండర్–14, 17, 19 బాలబాలికలకు నిర్వహించిన టేబుల్ టెన్నిస్ పోటీలు హోరాహోరీగా జరిగాయి. అదేవిధంగా ఫుట్‌బాల్ పోటీల్లో దరియాలతిప్ప డాక్టర్ కేఆర్‌నారాయణన్ ప్రభుత్వ హైస్కూల్ జట్టు విన్నర్‌గా, ఎంజీజీ ప్రభుత్వ హైస్కూల్ జట్టు రన్నర్‌గా, రీజెన్సీ హైస్కూల్ తృతీయ స్థానాన్ని సాధించారు. వీరంతా ఈ నెల 26, 27 తేదీల్లో మాహేలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ వినకోటి సన్యాసిరావు తెలిపారు.

పదే పదే కోతలెందుకు

- నిర్వహణ లోపంతో తరచూ అవాంతరాలు
- స్థానికంగా అందుబాటులో ఉండని లైన్‌మన్‌లు



కూనవరంలో విద్యుత్ స్తంభానికి అల్లుకున్న తీగజాతి పాదులు



ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి కొత్తచెరువు ప్రాంతంలో పంట కాలువలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైను

ఉప్పలగుప్తం: విద్యుత్ సబ్‌స్టేషన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల కత్తిరింపు, నిర్వహణ పనుల నిమిత్తం విద్యుత్ నిలిపేస్తున్నట్లుగా ప్రతి వారం విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ప్రకటనలిస్తుంటారు. ఎప్పటికప్పుడు ఆయా పనులు జరుగుతున్నట్లుగా చెబుతుంటారు. అయినా గ్రామాల్లో ఎక్కడ చూసినా చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు, విద్యుత్ స్తంభాలకు అల్లుకున్న పాదులు అలంకరణ సెట్టింగుల్లా దర్శనమిస్తుంటాయి. నిజంగా ప్రతివారం నిర్వహణ పనులు జరుగుతుంటే గ్రామాల్లో ఏదొక సమస్యతో పదే పదే విద్యుత్ అంతరాయాలు ఎందుకు కలుగుతున్నట్లు అన్నది వేయి డాలర్ల ప్రశ్నగా మిగిలింది.

అటకెక్కిన నిర్వహణ

గ్రామాల్లో ఉద్యోగం చేయాల్సిన లైన్‌మెన్‌లు వేరే ప్రాంతాల్లో ఉంటూ ప్రైవేటు వ్యక్తులతో విధులు నిర్వర్తించడం బహిరంగ రహస్యమే. గ్రామాల్లో అనునిత్యం పరిశీలన చేయాల్సిన లైన్ ఇన్‌స్పెక్టర్‌లు కేవలం ఆక్వా చెరువుల పరివేక్షణకే అంకితమవ్వటంతో గ్రామాల్లో నిర్వహణ అటకెక్కింది. అమలాపురం నియోజకవర్గంలోని అమలాపురం మండలంలో పేరూరు, ఇందుపల్లి, కామనగరువు, మార్కెట్ ప్రాంతాల్లో నాలుగు సబ్‌స్టేషన్‌లు, ఉప్పలగుప్తం మండలంలో ఉన్న చల్లపల్లి, ఉప్పలగుప్తం, అల్లవరం మండలంలో అల్లవరం, బెండమూర్లంక, దేవగుప్తం, బోడసకుర్రు సబ్‌స్టేషన్ల ద్వారా విద్యుత్ సరఫరా జరుగుతుంది. అయితే ఆయా ప్రాంతాల్లో నిర్వహణ లోపం కారణంగా పలు గ్రామాల్లో పదే పదే సమస్యలు తలెత్తుతున్నాయి. మూడు మండలాల్లోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్‌లు శిథిలావస్థకు చేరుతున్నా అధికారులు నిర్లక్ష్యంతో వదిలేస్తుండడంతో లోఓల్టేజ్ సమస్యలు వస్తున్నాయి. కొన్ని చోట్ల ఐదారు గ్రామాలకు కలిపి ఒక ఫీడర్ ఉండటంతో ఏ గ్రామంలో సమస్య వచ్చిన అన్నీ గ్రామాలకు సరఫరా నిలిచిపోతుంది. గ్రామంలో ఎక్కడ చెట్లు, కొమ్మలు తగిలినా ఫీజు ట్రిప్ అయిపోతుంది.

క్షేత్రస్థాయిలో ఇదీ పరిస్థితి

- గత నెలలో అల్లవరం మండలం ఓడలరేవులో నిర్వహణ లోపంతో ట్రాన్స్‌ఫార్మర్ పేలి మంటలు చెలరేగటంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆ సమయంలో స్థానికంగా ఆక్వా రైతులు లేకపోవడంతో ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.
- బోడసకుర్రు గ్రామంలో అల్లుకున్న పాదులు విద్యుత్ వైర్లకు తగలటంతో పొగలు చెలరేగి విద్యుత్ అంతరాయం ఏర్పడింది. ఉప్పలగుప్తం మండలంలో ఎస్.యానం గ్రామంలో విద్యుత్ వైర్లు తగిలి రెండు ఆవులు దుర్మరణం చెందాయి.
- ఉప్పలగుప్తం నుంచి గొల్లవిల్లి, భీమనపల్లి, నంగవరం, విలసవిల్లి కలిపి ఫీడర్ అదే విధంగా మునిపల్లి, వానపల్లిపాలెం, పెదగాడవిల్లి, చినగాడవిల్లి, ఎస్.కొత్తపల్లి, సన్నవిల్లి గ్రామాలకు సంబంధించి మరొక ఫీడర్ కలిపి ఉండటంతో ఏ గ్రామంలోనైనా విద్యుత్ స్తంభాలకు పాదులు అల్లుకుని తీగలకు తగిలితే అన్ని గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడుతుంది.
- భీమనపల్లి పంచాయతీ పరిధి సూదాపాలెం, ఉప్పలగుప్తం పంచాయతీ పరిధి చీకట్లపాలెం, కొత్తచెరువు ప్రాంతాల్లో చేతికందే ఎత్తులో విద్యుత్ వైర్లు ఉండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు.

సిబ్బంది అందుబాటులో లేక సమస్యలు

విద్యుత్ సిబ్బంది అందుబాటులో లేక తరచూ సమస్యలు తలెత్తుతున్నాయి. మా విలసవిల్లి గ్రామానికి ఐదు గ్రామాలకు కలిపి ఒకటే ఫీడర్ ఉంది. అది కూడా చేల మధ్యలో ఉండటంతో ఏదైనా సమస్య వస్తే కరెంటు కోతతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పైగా లైన్‌మన్ అందుబాటులో ఉండడం లేదు.

– సలాది స్వామినాయుడు, విలసవిల్లి, ఉప్పలగుప్తం మండలం

వారాంతపు నిర్వహణ చేయిస్తున్నాం

విద్యుత్ అంతరాయం కలగకుండా ప్రతి శుక్రవారం నిర్వహణ పనులు చేయిస్తున్నాం. ప్రధాన లైన్లు 33 కేవీ, 11 కేవీలపై సిబ్బంది మరమ్మతులు చేస్తున్నారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా వారంలో కేవలం 6 గంటలు మాత్రమే నిర్వహణ నిమిత్తం కోతలు విధిస్తున్నాం. విద్యుత్ అంతరాయాలు లేకుండా చూస్తాం.

– ఎం.రవికుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అమలాపురం

చెకుముకి పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



చెకుముకి పరీక్షలో ప్రథమ స్థానం సాధించిన ఓడలరేవు విద్యార్థులు

అల్లవరం: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లవరం ఉన్నత పాఠశాలలో మంగళవారం జరిగిన మండల స్థాయి చెకుముకి సైన్సు టాలెంట్ పరీక్షల్లో ఓడలరేవు ఉన్నత పాఠశాల విద్యార్థులు జాహ్నవి, గాయత్రి, కనకరాజు ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అల్లవరం హైస్కూల్ హెచ్‌ఎం ఎస్.వెంకటేశ్వరరావు పరీక్ష పత్రాలను విడుదల చేశారు. మండలం నుంచి 8 ప్రభుత్వ పాఠశాలలు, ఒక గురుకులం, ఒక ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు చెకుముకి పరీక్షకు హాజరయ్యారు. విజేతలకు ప్రశంసాపత్రం, షీల్డ్ అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కేఎస్ఆర్ మూర్తి, బీఎస్ శివకుమార్, కేవీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కొత్త రేషన్‌కార్డుల జారీకి సర్వే

యానాం: నియోజకవర్గ పరిధిలో వివిధ గ్రామాల్లో నివసిస్తూ పాత రేషన్‌కార్డులను విడదీసి నూతన రేషన్‌కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారి ఇళ్లకు వెళ్లి అధికారులు సర్వే నిర్వహించనున్నట్లు ఆర్ఏఓ, పౌరసరఫరాల శాఖ అధికారి ఆర్.మునిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొత్త రేషన్‌కార్డుల కోసం 346 మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. ఈ నెల 7వ తేదీ నుంచి డిసెంబర్ 13వ తేదీ వరకూ సర్వే జరుగుతుందన్నారు.

విద్యార్థులతో చెడీ తాలింఖానా సందడి



చెడీ తాలింఖానా ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థినులు

అమలాపురం టౌన్: స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కోనసీమ సంప్రదాయ విద్య అయిన చెడీ తాలింఖానా ప్రదర్శనలు విద్యార్థులు చేపట్టి సందడి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎస్.రాజరాజేశ్వరి అధ్యక్షతన మంగళవారం జరిగిన ఈ కార్యక్రమంలో విజయ దశమి ఉత్సవాలు ముందే నిర్వహించారు. అమలాపురంలో దాదాపు 190 ఏళ్ల చరిత్ర ఉన్న చెడీ తాలింఖానాపై లింగోలు శ్రీనివాస్, తూలం బుజ్జి, తూము రమేష్, ఆకుల బుజ్జిలు విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులతో చెడీ తాలింఖానా విద్యపై శిక్షణ ఇచ్చి వారి చేత ప్రదర్శింపజేశారు. అనంతరం చెడీ తాలింఖానా నిష్ణాతులను పాఠశాల తరపున ప్రధానోపాధ్యాయురాలు రాజరాజేశ్వరి, ఫిజికల్ డైరెక్టర్ తోట రవి, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

పుదుచ్చేరికి అవతల ఉన్న రీజియన్లకు వెళ్లాలి

యానాం: పుదుచ్చేరికి ఆవల దూరంగా ఉన్న యానాం, మాహే, కారైకల్ వంటి రీజియన్లకు వివిధ శాఖల కార్యదర్శులు, కమిషనర్స్ కమ్ సెక్రటరీలు క్రమం తప్పకుండా నెలలో కనీసం ఒకసారైనా అధికారిక పర్యటనలు జరపాలని ఎల్జీ కైలాష నాథన్ మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఆయా రీజియన్లలో పర్యటించి తనిఖీల నివేదికను మూడు రోజుల్లోగా తనకు అందించాలన్నారు. దీనికి సంబంధించి నెలవారీ టూర్ ప్రోగ్రామ్ గురించి వివరాలను అడ్మినిస్ట్రేటివ్ రిఫామ్స్‌కు వారం ముందు సంబంధిత అధికారులు సమర్పించాలన్నారు.

బాలయోగి సేవలు చిరస్మరణీయం



బాలయోగి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీ హరీష్‌మాథూర్, ఎమ్మెల్యే సుబ్బరాజు

ఐ.పోలవరం: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 73వ జయంతిని ఐ.పోలవరం మండలంలోని ఎదుర్లంక పాత ఇంజరం గ్రామంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాలయోగి నిలువెత్తు విగ్రహానికి ఆయన తనయుడు, ఎంపీ హరీష్‌మాథూర్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కోనసీమ అభివృద్ధికి తనదైన ముద్ర వేయడంతో పాటు 216 జాతీయరహదారి నిర్మాణం, కోటిపల్లి–నర్సాపురం రైల్వే లైను, ఎదుర్లంక–యానాం వంతెన నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాల ద్వారా కోనసీమను బాహ్య ప్రపంచంతో అనుసంధానం చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు, నాయకులు చెల్లి వివేకానంద, పొన్నమండ రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు: బాలయోగి 73వ జయంతి కార్యక్రమాన్ని తాళ్లరేవు, నీలపల్లి గ్రామాల్లో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేడ్కర్ భవన్ వద్ద గల బాలయోగి విగ్రహానికి కూటమి నాయకులు ధూళిపూడి వెంకటరమణ, జక్కల ప్రసాద్, టి.లక్ష్మణరావు, ఎంజి సూర్యనారాయణ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముమ్మిడివరం: లోక్‌సభ మాజీ స్పీకర్ జీఎంసీ బాలయోగి 73వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం స్థానిక పోలమ్మ చెరువు వద్ద గల బాలయోగి విగ్రహానికి గుత్తుల సాయి, చెల్లి అశోక్, దొమ్మేటి రమణకుమార్, అర్థాని శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

3 నుంచి విజయ దశమి ఉత్సవాలు



దసర ఉత్సవాల గురించి వివరిస్తున్న పట్టణ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు సత్యనారాయణమూర్తి

అమలాపురం టౌన్: ఈ నెల 3వ తేదీ నుంచి 12వ తేదీ వరకూ అమలాపురం వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారి ఆలయంలో విజయ దశమి నవరాత్ర ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్య వైశ్య సంఘం ప్రతినిధులు తెలిపారు. స్థానిక ఆలయం వద్ద వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి కళ్యాణ మండపంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో సంఘం అధ్యక్షుడు నంబూరి సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ విజయవాడ కనకదుర్గమ్మ దేవస్థానంలో అమ్మవారిని అలంకరించిన ట్లుగానే రోజూ ఇక్కడా వాసవీ మాతను అలంకరిస్తామన్నారు. ఉత్సవాలతో పాటు నిత్యం అమ్మవారి సన్నిధిలో విశేష పూజలు, హోమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి నంబూరి నరేష్, ఉత్సవ కమిటీ చైర్మన్ అప్పన వీరన్న, వరదా సూరిబాబు, వంకాయల కాశీ, కొమ్మూరి వెంకటాచల ప్రసాద్, పచ్చిగోళ్ల సోమరాజు, నూలు శ్రీనివాస్, నందిపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చెకుముకి విజేతలకు బహుమతులు అందజేత

యానాం: స్థానిక మహాత్మాగాంధీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బ్లాక్‌లెవెల్ చెకుముకి సైన్స్ సంబరాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ హైస్కూల్ నుంచి శివరామకృష్ణ, రుద్ర, పుష్పక్ జట్టు ప్రథమ స్థానం, ప్రైవేట్ స్కూల్స్ విభాగం నుంచి అర్పిత, శ్రీలాస్య, అఖిల్ జట్టు ప్రథమ, ప్రభుత్వ పాఠశాలల నుంచి గిరియాంపేట నాగదేవి, గణేష్, సుదర్శన్ జట్టు ద్వితీయ, ప్రైవేట్ పాఠశాలల నుంచి యశస్వి, నాగసాయి, శ్రీభవ్య జట్టు ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు ప్రముఖకవి దాట్ల దేవదానం రాజు బహుమతులు అందజేశారు. ప్రథమ స్థానం సాధించిన జట్టు అక్టోబర్ 27న జరిగే జిల్లా స్థాయి చెకుముకి పోటీల్లో పాల్గొంటారని రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ, మోహిబుల్లాఖాన్, టి.శ్రీనివాస్, ఎం.బాలకృష్ణ, కాంతికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ ద్వారా వేలాది మంది సేవలు



బీఎస్ఎన్ఎల్ ఆవిర్భావ దినోత్సవంలో డీఈఈ నరసింహరావు తదితరులు

అమలాపురం టౌన్: బీఎస్ఎన్ఎల్ సంస్థ 24 ఏళ్ల కిందట ఆవిర్భవించి నేడు వేలాది మంది ఉద్యోగులతో దేశ ప్రజలకు సేవలు అందిస్తోందని అమలాపురం బీఎస్ఎన్ఎల్ డీఈఈ పీఎస్ఎల్ నరసింహరావు అన్నారు. బీఎస్ఎన్ఎల్ సంస్థ 24 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని సంస్థ అమలాపురం డివిజన్ కార్యాలయంలో డీఈఈ నరసింహరావు బీఎస్ఎన్ఎల్ 25 ఏళ్ల కేక్‌ను కట్ చేసి ఆవిర్భావ దినోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం బీఎస్ఎన్ఎల్ ఇంజినీర్లు, ఉద్యోగులు, టెలికం ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రొవైడర్స్(టీఐపీ) సిబ్బంది పుర వీధుల్లో మోటారు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బీఎస్ఎన్ఎల్ ఎస్‌డీఈలు వై.వెంకటేశ్వరరావు, కేఎస్‌వీ ప్రసాద్, జేటీవోలు కేజేఎస్ రాజేంద్ర, పి.శ్రీనివాస్, పి.రవిబాబు, కేబీఎస్ఎస్ మూర్తి, టీవీఎస్ఎస్ఎస్ రావు, టీఐపీలు ఎం.ప్రసాద్, డి.ఏడుకొండలు, ఇ.జగదీష్, ఎ.సుబ్రహ్మణ్యం, ఎ.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఐదుగురి ఎంపిక



రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

తాళ్లరేవు: చినబొడ్డు వెంకటాయపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన ఐదుగురు విద్యార్థులు స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు స్కూల్ హెచ్‌ఎం కేఆర్‌కే సాయిప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హ్యాండ్‌బాల్ క్రీడకు సంబంధించి అండర్–17 బాలుర విభాగంలో కొపనాతి గణేష్, అండర్–17 బాలికల విభాగంలో చెక్కా హేమలత, అండర్–14 బాలుర విభాగం నుంచి పినపోతు ధనుష్, కొపనాతి దేవీ శరత్‌కుమార్, అలాగే రగ్బీకి కర్రి రామ్‌చరణ్‌లు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థులకు తర్ఫీదునిచ్చిన స్కూల్ పీడీ లంకే చంద్రావతిలను హెచ్‌ఎం సాయిప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు. అదేవిధంగా ఆగస్టు 4వ తేదీ నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగిన జాతీయ స్థాయి టగ్ ఆఫ్ వార్ పోటీలలో రేకాడి సంతోష్‌కుమార్ అంకాడి శ్రీరామ్‌తేజలు తృతీయ స్థానం సాధించినట్లు తెలిపారు.

రాజీవ్ రివర్‌బీచ్ రహదారిలో స్వచ్ఛభారత్

యానాం: యానాం నెహ్రూ యువ కేంద్రం, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు సంయుక్తంగా మంగళవారం స్థానిక గౌతమీగోదావరి బీచ్ రహదారిలో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునిస్వామి హాజరయ్యారు. ఈ సందర్భంగా రహదారి వెంబడి ఉన్న చెత్తను, ప్లాస్టిక్ వ్యర్థాలను, ఖాళీ బాటిళ్లను తొలగించారు. అనంతరం ఉపాధ్యాయులు, వలంటీర్లు, విద్యార్థులు స్వచ్ఛభారత్ ప్రతిజ్ఞ చేశారు. అందరికీ మైభారత్ పెన్నులను బహూకరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, ఎస్ఆర్‌కే ప్రిన్సిపాల్ వరుగు భాస్కరరెడ్డి, జిల్లా యువజన అధికారి గోపి, రీజినల్ కోఆర్డినేటర్ చింతపల్లి కృష్ణసుధాకర్, ప్రోగ్రాం ఆఫీసర్లు చల్ల నరేష్, ఎస్.శ్రీనివాస్, కృష్ణంరాజు, గణేష్, వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

స్వర్ణాంధ్రపై విద్యార్థులకు పోటీలు



విజేతలకు బహుమతులు అందిస్తున్న డీఈవో కమలకుమారి తదితరులు

అమలాపురం టౌన్: ప్రభుత్వం చేపట్టిన స్వర్ణాంధ్ర–2047 కార్యక్రమంలో భాగంగా స్థానిక కొంకాపల్లి జవహర్‌లాల్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జిల్లా స్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 64 పాఠశాలల నుంచి విద్యార్థులు పోటీలకు హాజరయ్యారు. కార్యక్రమానికి డీఈవో ఎం.కమలకుమారి, జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ ఎ.మధుసూదనరావు, అడిషనల్ డైరెక్టర్ నరేష్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. డీఈవో కమలకుమారి మాట్లాడుతూ విద్యార్థులు రాష్ట్రాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. అనంతరం పోటీల విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ధ్రువీకరణ పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీవైఈవో గుబ్బల సూర్యప్రకాశం, సీఎంవో బి.సుబ్రహ్మణ్యం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.ఘన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


పంచాయతీ సిబ్బందిపై మందుబాబు వీరంగం



సుంకరపాలెం పంచాయతీలో సిబ్బందిపై దాడి చేస్తున్న మందుబాబు

తాళ్లరేవు: సుంకరపాలెం పంచాయతీ సిబ్బందిపై మందుబాబు వీరంగం సృష్టించాడు. పంచాయతీ సిబ్బంది తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన పలివెల శాంతారావు అనే వ్యక్తి మంగళవారం ఉదయం మద్యం తాగి పంచాయతీ కార్యాలయానికి వచ్చాడు. తన కొడుక్కి ఇన్‌కం సర్టిఫికెట్ ఇవ్వడానికి వీల్లేదంటూ దుర్భాషలాడుతూ వీరంగం సృష్టించాడు. కార్యాలయంలోని కుర్చీలను, బల్లలను తోసేసి కార్యాలయ సిబ్బందిని భయభ్రాంతులకు గురిచేశాడు. దీంతో వారు కోరంగి ఎస్ఐ పి.సత్యనారాయణకు సమాచారం ఇచ్చారు. ఎస్ఐ ఆదేశాలతో కానిస్టేబుళ్లు అక్కడకు వచ్చి శాంతారావును అదుపులోకి తీసుకుని అనంతరం వదిలిపెట్టారు. కుటుంబ తగాదాల నేపథ్యంలో శాంతారావు మద్యం మత్తులో ఈ దాడికి పాల్పడినట్లు ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగుల మీద దాడి చేయడం తగదని మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు తిళ్లపూడి నాగేశ్వరరావు అన్నారు.

వృద్ధుల సమస్యల పరిష్కారమే లక్ష్యం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి రహంతుల్లా

ముమ్మిడివరం: వృద్ధుల సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా ఏటా అక్టోబర్ 1న సీనియర్ సిటిజన్ డే జరుపుకుంటున్నామని మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్, జూనియర్ సివిల్ జడ్జి మహమ్మద్ రహంతుల్లా పేర్కొన్నారు. సీనియర్ సిటిజన్ డేను పురస్కరించుకుని మంగళవారం కొమానపల్లి సచివాలయం వద్ద జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సుకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. పిల్లలు వదిలేసిన వృద్ధులకు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ప్యానల్ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందిస్తామన్నారు. వృద్ధులకు యువత సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి సత్యనారాయణ, ఎస్ఐ జ్వాలాసాగర్, సర్పంచ్ కాశి ఇందిర, పంచాయతీ కార్యదర్శి కె.దుర్గాప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో సమయానుకూలంగా చర్యలు చేపట్టాలి



పెదగాడవిల్లిలో వరి క్షేత్రాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తల బృందం



చొల్లంగిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న ఏడీఏలు బాబూరావు, మాధవి తదితరులు

ఉప్పలగుప్తం: వరి పంటలో సమయానుకూలంగా సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఆత్మ పీడీ వై.జ్యోతిర్మయి అన్నారు. మండలంలోని పెదగాడవిల్లిలో మంగళవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొని వరి పొలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా వరిలో ఎండాకు తెగులు నివారణకు ఎకరాకు ప్లాంటోమోసిన్ 100 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 500 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో ఏరువాక సైంటిస్ట్ ఎం.నందకిషోర్, అమలాపురం ఏడీఏ ఎంఏ షంషీ, డీఆర్ఏడీఏ ఏవీ రాజశేఖర్, వ్యవసాయాధికారులు జి.కుమార్‌బాబు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

చొల్లంగిలో పొలం పిలుస్తోంది

తాళ్లరేవు: వ్యవసాయంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వాటికి పరిష్కార మార్గాలను చూపేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం చొల్లంగి గ్రామంలో నిర్వహించారు. మండల వ్యవసాయశాఖాధికారి ఎన్.ప్రశాంతి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ ఏడీఏ బాబూరావు హాజరై పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ఆకుముడత, కాండం తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రైతులకు నివారణ చర్యలను వివరించారు. పెద్దాపురం డీఆర్‌సీ ఏడీఏ మాధవి మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లోరైతులందరూ ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గు చూపాలన్నారు. కార్యక్రమంలో అభ్యుదయ రైతులు గర్రే లక్ష్మీనారాయణ, స్వర్ణ రాజు, గండి శ్రీనివాస్, శ్రీపాదం సత్యనారాయణ, ఈతమూడి రాఘవ, అంకన ఆంజనేయులు, కట్టిమేను నూకరాజు పాల్గొన్నారు.

స్మార్త విద్యార్థులకు సదుపాయాలు కల్పించాలి



ఎంపీ హరీష్ మాథూర్‌కు వినతి పత్రం అందిస్తున్న స్మార్త పండితులు

అమలాపురం టౌన్: స్మార్త విద్యార్థులకు జిల్లా కేంద్రం అమలాపురంలో పాఠశాల లేదా సామాజిక భవనం వంటివి సమకూర్చి వసతి సదుపాయాలు కల్పించాలని ఆపస్తంబ పురోహిత పరిషత్ ఆధ్వర్యంలో స్మార్త పండితులు ఎంపీ గంటి హరీష్ మాథూర్‌కు వినతిపత్రం అందజేశారు. పురోహిత పరిషత్ అధ్యక్షుడు గొర్తి సాయి, కార్యదర్శి ఆకొండి పవన్, కార్యవర్గ ప్రతినిధులు ఆకెళ్ల రాజబాబు, భళ్లమూడి దివాకర్ శాస్త్రి, కడియాల శ్రీనివాస్, పంచాంగ కర్త ఉపద్రష్ట నాగాదిత్య, స్మార్త పండితులు కర్ర శివయ్య, అనుపిండి మూర్తి తదితరులు మంగళవారం అమలాపురంలో ఎంపీని కలిసి స్మార్త విద్యార్థుల వసతి సమస్యలను వివరించారు. స్మార్త పాఠశాల ఏర్పాటుకు కృషి చేస్తానని ఎంపీ హరీష్ మాథూర్ అన్నారు.